బలగం
BALAGAM
TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 04 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4

## అటవీశాఖలో ఏసీబీ దాడులు

- రూ.3.51లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎఫ్‌డీఓ డివిజనల్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ రమేష్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
కొత్తగూడెంలోని తెలంగాణ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్యాలయం (ఎఫ్‌డీఓ)లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి కాంట్రాక్టర్‌ను లంచం అడిగినందుకు, మధ్యవర్తితో సహా ఇద్దరు ఫారెస్టు డెవలప్‌మెంట్ అధికారులపై కేసులు మిగితా 2వ పేజీలో




## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు

- 14 మంది మావోయిస్టులు మృతి

**బలగం టీవి, చత్తీస్‌గడ్**
ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంట ర్ జరిగిన ప్రదేశాల నుంచి భారీగా ఆయుధాలు లభించాయి. ఈ ఏడాదిలో జరిగిన మొదటి భారీ మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ ఇదేనని అధికారులు చెప్పారు. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..బీజాపూర్‌లోని బసగూడ-తర్రెం అటవీ ప్రాంతం, సుక్మాలోని కొంతా-కిష్టారమ్ అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు దాగి ఉన్నారన్న సమాచారం నిఘా వర్గాల ద్వారా అందింది. అనంతరం జిల్లా రిజర్వ్ గార్డు (డీఆర్‌జీ) బృందాలు శనివారం ఉదయం వేర్వేరుగా తమ పరిధిలోని ప్రాంతాల్లో సోదాలు జరిపాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 14 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. సుక్మా ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి 12 మంది మావోయిస్టు మృతదేహాలను, బీజాపూర్ నుంచి ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు

బస్తర్ ఐజీ సుందర్రాయ్ పట్టిలింగం చెప్పారు. ఘటన ప్రదేశాల నుంచి ఒక ఏకే-47, ఇన్సాస్ రైఫిల్, సెల్ఫ్-లోడింగ్ రైఫిల్, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.ఎన్‌కౌంటర్ జరిగిన రెండు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నట్టు ఆయన తెలిపారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ఆపరేషన్ వివరాలను మాత్రం వెల్లడించలేదు. పూర్తి వివరాలను ఆపరేషన్ ముగిశాక



చెప్తామని వివరించారు. ఇక ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా సిబ్బందికి ఏమైనా గాయాలయ్యాయా అన్నదానిపై ఎలాంటి సమాచారమూ లేదు. దీని గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో సుక్మా, బీజాపూర్ జిల్లాలు అత్యంత మావోయిస్టు ప్రభావిత జిల్లాలుగా ఉన్నాయి. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో ఒకప్పుడు వీటిని మావోయిస్టులకు కంచుకోటగా పిలిచేవారు. ఇప్పుడు అవే జిల్లాల్లో ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోవడం, మావోయిస్టులు తమ ప్రాణాలను కోల్పోతుండటం గత కొన్ని నెలలుగా జరుగుతున్నది. ముఖ్యంగా 2025లో బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు పెద్ద దెబ్బే తగిలిందని అధికారులు అంటున్నారు. ఇక్కడ దాదాపు 256 మంది మావోయిస్టులు మృతిచెందగా, దాదాపు 1650 మంది లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయారని వారు గుర్తు చేస్తున్నారు. దేశంలో మావోయిస్టులను లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని మోడీ సర్కారు నిర్ణయించుకున్నది. ఇందుకోసం ఈ ఏడాది మార్చి 31ని డెడ్‌లైన్‌గా నిర్దేశించుకున్నది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలు సందర్భాలలో పదేపదే ఇదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు.

### ఉపాధి హామీ చట్టాన్ని
## యథాతథంగా కొనసాగించాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనమండలి ఏకగ్రీవం గా తీర్మానాన్ని ఆమోదించింది. శనివారం మధ్యాహ్నం శాసనమండలిలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వీబీ జీరామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనీ, పాత చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త చట్టంతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందనీ, గ్రామాల్లో పేదలకు ఉపాధి కరువై వలసలు పెరుగుతాయనీ, పని దినాలు తగ్గుతాయని వెట్టి చాకిరీ పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంత పేదల ఉపాధి కోసం చట్టం తీసుకురావాలని ఆమె కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. చట్టాలకు ఉత్తరాది పదాలను పెడుతూ బలవంతంగా రుద్దుతున్న దని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవుల్లో మైనింగ్ పెరిగిందనీ, కార్పొరేట్ల కోసం కొత్త చట్టం తెచ్చారని ఆమె తప్పుపట్టారు. చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచం గుర్తించిన త్యాగశీలి మహాత్మాగాంధీ పేరు మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 80 శాతం రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నాయనీ, అలాంటి సమయంలో 40 శాతం వాటా తెలంగాణ రాష్ట్రం భరించాలని కొత్త చట్టం తేవడం సరికాదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం పాత చట్టాన్నే అమలు చేసేలా ఒత్తిడి తేవాలని ఆయన సూచించారు. సీపీఐ సభ్యులు నెలకంటి సత్యం మాట్లాడుతూ ప్రజల జీవించే హక్కును హరించేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కొత్త చట్టం జీవించే హక్కుకు గొడ్డలిపెట్టులాంటిదన్నారు. ఈ చట్టంతో ఆర్థిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఉపాధ్యాయ సభ్యులు ఏ.వీ.ఎన్.రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతా ల వైశాల్యాలను బట్టే నిధుల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో మెజారిటీ ప్రజలను అనాథలు చేసేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం ఉందని విమర్శించారు. యాంత్రీకరణ జరిగాక వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదంటూ కేంద్రం చేస్తున్న వాదన కేవలం సాకు మాత్రమేనని కొట్టిపారేశారు. 90 శాతం మంది ప్రజలు ఆధారపడ్డ 'ఉపాధి'లో మార్పులు చేసే ముందు కనీస సంప్రదింపులు జరపలేదని తప్పుపట్టారు.

## ఆటో డ్రైవర్ల చలో అసెంబ్లీ ఉద్రిక్తం

- అడ్డుకున్న పోలీసులు, తీవ్ర వాగ్వాదం, తోపులాట,
- రోడ్డుపై బైఠాయించిన ఆటో డ్రైవర్లు
- అరెస్టు చేసిన పోలీసులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
గత అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది ఆటో డ్రైవర్లు హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ వద్ద నుంచి పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్తుండగా, పోలీసులు అడ్డుకోగా తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో ఆటో డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించగా పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటీయూసీ), నాయకులు ఎండీబాబా (సీఐటీయూ) మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల అనేక మంది ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వంద శాతం



పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు కిలో మీటర్ కు రూ.20, మినిమం ఛార్జి రూ.50కు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కూ ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేయాలని, రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలో అక్రమంగా తిరుగుతున్న ఓలా, ఉబెర్, రాపిడో ద్విచక్ర వాహనాలను నిషేధించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వమే కొత్త యాప్‌ను తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు వేముల మారయ్య (బీఆర్‌టీయూ), ఎంఏ.సలీం (తెలంగాణ జాగతి), ఈ.ప్రవీణ్ (టీయూసీఐ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), పి.యాదగిరి (టీఎన్‌టీయూసీ), శివానందం (టీఏఎండీయూ), ఎస్.అశోక్, సిహెచ్. జంగయ్య, ఏం.క ష్ణ, ఎం.నరసింహ, శ్రీనివాస్, శ్యామ్ లాల్, మల్లికార్జున్ (ఏఐటీయూసీ), లింగం గౌడ్ (టీయూసీఐ) తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులాపై అమెరికా దాడులు




- ఎమర్జెన్సీ ప్రకటించిన వెనిజులా
- అధ్యక్షుడిని, అతని భార్యను అదుపులోకి తీసుకున్న అమెరికా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
వెనిజులాపై అమెరికా విరుచుకుపడింది. శనివారం తెల్లవారు జామున రాజధాని కారకస్ నగరంపై అమెరికా సైనిక బలగాలు పెద్ద ఎత్తున దాడులు జరిపాయి. అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను దేశం నుంచి తరలించాయి. వారిద్దరూ తమ అధీనంలోనే వున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించిన ట్రంప్, అమెరికా లా మిగితా 2వ పేజీలో

# తెలంగాణ ప్రజల
# హక్కులకు భంగం కలగనియ్యా..

- ప్రాణమున్నంత వరకు రాష్ట్ర ప్రయోజనాల కోసమే పని చేస్తా
- మా చిత్తశుద్ధిని శంకిస్తే తోలుతీస్తామన్న వారి నాలుకలు కోస్తా
- బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో బలమైన వాదనలు వినిపిస్తాం
- 'నీళ్లు-నిజాలు'పై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు మరణ శాసనం రాసిందే మాజీ సీఎం కేసీఆర్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రాజెక్టును ఏపీకి తనఖా పెట్టిన ఘనుడాయనంటూ ఎద్దేవా చేశారు. చచ్చినా తెలంగాణ కోసమే.. బతికినా తెలంగాణ కోసమే..ప్రాణమున్నంత వరకు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసమే పని చేస్తాం...' అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలన్నదే తమ ఆలోచనని ఆయన తెలిపారు. 'దేవుడి మీద ఆన.. నేను ఉన్నంత వరకు తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనీ యను...' అని సీఎం భావోద్వేగంతో చెప్పారు. ఈ విషయంలో తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించొద్దని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు హితవు పలికారు. అలా చేస్తే తమ తోలు తీస్తామన్న వారి నాలుకలు కోస్తామంటూ ఘాటుగా హెచ్చరించారు. శనివారం శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 'నీళ్లు-నిజాలు' అనే అంశంపై స్వల్పకాలిక చర్చను చేపట్టారు. అంతకుముందు సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ఇచ్చారు. అనంతరం జరిగిన చర్చలో...కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు పాల్గొన్నారు. వారు లేవనెత్తిన పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో కూడిన వివరాలను ఉదహరిస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. రాత్రి 7.22 గంటలకు మొదలైన ఆయన ప్రసంగం రాత్రి 10 గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా సీఎం... ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌పైన, మాజీ మంత్రి హరీశ్‌రావుపైన, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైన ఆయన నిప్పులు చెరిగారు. కేసీఆర్‌తోపాటు బీఆర్ఎస్ సభ్యులెవరూ సభకు రాకపోవటాన్ని ప్రస్తావిస్తూ సెటైర్లు, వ్యంగ్యాస్త్రాలతో కూడిన విమర్శలను గుప్పించారు.

బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో రాష్ట్రం తరపున బలమైన వాదనలను వినిపించటం ద్వారా ఏడాదిలోగా అన్ని ప్రాజెక్టులకు అనుమతులు తెప్పిస్తామనే ఆశాభావాన్ని సీఎం ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. తద్వారా వాటిని పూర్తి చేస్తామంటూ హామీనిచ్చారు. తెలంగాణ నీటి వాటాల విషయంలో ఎవ్వరితోనైనా కలబడతాం తప్ప తలవంచబోమని ఆయన స్పష్టం చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లు, అనుభవజ్ఞులు, మేధావులు, ఉన్నత విద్యావంతులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే అదృష్టం తనకే దక్కిందని చెప్పారు. అలాంటి ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా కష్టపడతానని తెలిపారు. నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందంటూ అసెంబ్లీ బయట గగ్గోలు పెడుతున్న బీఆర్ఎస్ అధినేత, ఆ పార్టీ నేతలు.. సభకు ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు. శాసననసభకే రానప్పుడు వారికి ఎమ్మెల్యే పదవులు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవులు ఎందుకంటూ ప్రశ్నించారు. గతంలో ఏపీ మాజీ సీఎం జగన్‌ను తన ఇంటికి పిలిపించి, పంచభక్ష పరమాన్నం పెట్టిన కేసీఆర్.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ఓకే చెప్పారంటూ ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేటి ఏపీ సీఎం చంద్రబాబుపై ఒత్తిడి చేసి, కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి, ఆ స్కీమ్‌ను నిలుపుదల చేయించామని వివరించారు. ఇదీ తమ చిత్తశుద్ధంటూ వ్యాఖ్యానించారు. విషయం, సబ్జెక్టు ఉన్న వారిని వ్యక్తులుగా తాము గౌరవిస్తామని, అదే సమయంలో హక్కులకు భంగం కలిగిస్తే మాత్రం తిరగబడతామని హెచ్చరించారు. అందువల్ల మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ హితవు పలికారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి జూరాల వద్ద ప్రారంభించాల్సిన దాన్ని, శ్రీశైలం వరకు పొడిగించటం వెనుక పెద్ద కతే ఉందని సీఎం ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్లతో కలిసి రూ.55 వేల కోట్లను కొల్లగొట్టేందుకే కేసీఆర్ ఇలాంటి స్కెచ్‌ను వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గం వల్ల ఆ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకూ నీరివ్వలేదని విమర్శించారు. 'పాలమూరు-రంగారెడ్డి' అనేది కేవలం తాగునీటి కోసం ఉద్దేశించి తప్ప సాగునీటి ప్రాజెక్టు కాదంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి సుప్రీంకోర్టు దాకా గగ్గోలు పెట్టింది బీఆర్ఎస్ నేతలు, ఆనాటి సీఎం కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. వారు చేసిన ఈ నిర్వాకం వల్ల ఎన్జీటీ రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఎత్తున పెనాల్టీలు విధించిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌కు సాగునీటిని ఇవ్వాలి, అక్కడకు పరిశ్రమలు రప్పించాలనే ఉద్దేశమే కేసీఆర్‌కు లేదని దుయ్యబట్టారు. అందువల్లే పాలమూరు-రంగారెడ్డిని పక్కనబెట్టారని విమర్శించారు.

## బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కీలకం




- రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు, పౌరసర ఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
బీఆర్ఎస్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టుపై పెట్టిన శ్రద్ధ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై పెట్టలేదని రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేవలం 30శాతం నిధులను మాత్రమే ఖర్చుపెట్టి అన్యాయం చేశారని నిరసన తెలిపారు. శాసనసభలో స్పీకర్ జి ప్రసాద్‌కుమార్ అనుమతి మేరకు శనివారం కృష్ణా, గోదావరి జలాలపై మంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు బీఆర్ఎస్ సర్కారు 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని గుర్తు చేశారు. 'కాళేశ్వరంపై రూ. 90 వేల కోట్లు ఖర్చు చేశారనీ, పాలమూరుపై కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే వెచ్చించినట్టు తెలిపారు. కాళేశ్వరం నుంచి రోజుకు మూడు టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచి, పాలమూరులో మాత్రం 1.5 టీఎంసీకి తగ్గించారనీ అన్నారు. ప్రాణహిత-చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారనీ, జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేదని తెలిపారు. రూ. 7469.26 కోట్లు ఖర్చు చేస్తే కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పూర్తయ్యేవని మంత్రి ఉత్తమ్ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి అక్రమంగా నీటిని తరలిస్తుంటే గత బీఆర్ఎస్ సర్కారు చూస్తూ కూర్చున్నదని మంత్రి విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలను అంగీకరించి కేసీఆర్ సర్కార్ తీవ్ర అన్యాయం చేసిందని గుర్తు చేశారు. కృష్ణా నది పరివా హకం ప్రకారం తెలంగాణకు అధిక వాటా రావాల్సి ఉందనీ, మేంవచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించామని వివరించారు. ఒక్క టీఎంసీనే కాదు.. నీటిచుక్కనూ కూడా వదులుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు త్వరలో వెలువడనుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గుర్తు చేశారు. తాను స్వయంగా ట్రిబ్యునల్ వాదనలకు హాజరవుతున్నాననీ, కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 72 శాతం వరకు నీటి కేటాయింపులు వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. మిగితా 2వ పేజీలో



## ఇందిరమ్మ ఇండ్ల సమస్యను పరిష్కరించండి

- మంత్రి పొంగులేటికి స్పీకర్ ఆదేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల సమస్యను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయం లో పలువురు సభ్యులు ఇందిరమ్మ ఇండ్ల సమస్య గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సభ్యులతో సమావేశం పెట్టాలని కోరారు. తన నియోజకవర్గం వికారాబాద్‌లోనూ డబుల్ బెడ్రూం ఇండ్లు 90 శాతం పనులు పూర్తయ్యాయనీ, మిగిలిన 10 శాతం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, జయధీర్‌రెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, దానం నాగేందర్, రాకేశ్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ హామీ ఇచ్చామని అన్నారు. నియోజకవర్గాల వారీగా మరికొన్ని ఇండ్లను మంజూరు చేస్తే ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు.

## డ్రగ్స్ కేసులో ఏపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
డ్రగ్స్ తీసుకుంటూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి ఈగల్ టీమ్‌కు చిక్కారు. రంగారెడ్డి జిల్లా నానక్ రాంగూడలో ఆయన్ని ఈగల్ టీమ్ శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నార్సింగ్‌లో కొందరు డ్రగ్స్ తీసుకుంటున్నట్టు ఫోన్ కాల్ రావడంతో ఈగల్ టీమ్, నార్సింగి పోలీసులు కలిసి ఆపరేషన్ నిర్వ హించారు. సుధీర్‌రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించగా.. ఆయనతో పాటు మరో ఇద్దరు స్నేహితులు డ్రగ్స్ తీసుకున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురికి డ్రగ్స్ టెస్ట్ చేయగా సుధీర్‌రెడ్డి గంజాయి తీసు కున్నట్టు నిర్ధారణ అయింది. దాంతో సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేసి.. డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్టు నార్సింగి పోలీసులు తెలిపారు. కాగా, సుధీర్‌రెడ్డి గతంలో కూడా రెండుసార్లు డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. సుధీర్‌రెడ్డి కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతం అవుతున్నట్టు సమాచారం.

## సావిత్రి బాయి జీవితం ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకం

- క్రీడా శాఖా మంత్రి వాకిటి శ్రీహరి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
దేశ తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని, ఆమె జీవితం ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకమని పశుసంవర్ధక క్రీడా శాఖ మంత్రి వాటికి శ్రీహరి అన్నారు. సావిత్రిబాయి పూలే ఫౌండేషన్, సావిత్రిబాయి ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ, సావిత్రిబాయి మహిళా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో సావిత్రిబాయి 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంత రావుతో కలిసి మంత్రి సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సావిత్రిబాయి తన భర్త ప్రోత్సాహంతో చదువుకుని, భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆమె ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ట్యాంక్ బండ్‌పై పూలే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లు చేయలేని పనులు మహిళలు చేస్తున్నారని తెలిపారు. రాబోవు రోజులలో చట్ట సభలలో 33 శాతం ప్రజా ప్రతినిధులుగా ఉంటారని చెప్పారు. బీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కష్ణయ్య మాట్లాడుతూ చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. మాజీ మంత్రి




వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం అంటరానితనానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేశారన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంత రావు మాట్లాడుతూ సావిత్రిబాయి జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం స్వాగతిస్తున్నానని తెలిపారు. అంబర్ పేట్‌లో జ్యోతిరావు పూలే ఆడిటోరియం నిర్మించాలని కోరారు. ప్రతి జిల్లాలో సావిత్రిబాయి పూలే ప్రతిభా పాటవా పోటీలతో పాటు విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ప్రధాని మోడీ నేతత్వంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు అండగా నిలబడి తక్కువ వడ్డీలకు రుణాలు అందించాలన్నారు.

## కేజీబీవీలో విద్యార్థిని మృతి

- సిద్దిపేట జిల్లా మిట్టపల్లి కేజీబీవీలో ఘటన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
స్కూల్‌లో ఆడుకుంటూ స్పృహ కోల్పోయి ప్రమాదవశాత్తు విద్యార్థిని మృతిచెందిన సంఘ టన సిద్దిపేట జిల్లా మిట్టపల్లి సమీపంలోని కేజీబీవీలో శుక్రవారం రాత్రి జరిగింది. సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం కల్లేపల్లి గ్రామా నికి చెందిన గుర్రం తిరుపతిరెడ్డి, శ్రావణి దంపతుల ఇద్దరు కుమార్తెలు.. మిట్టపల్లి సమీపంలోని కేజీబీవీలో చదువుకుంటున్నారు. పెద్దమ్మాయి వర్ష 9వ తరగతి చదువుతుండగా, చిన్న కూతురు హర్షిత (11) ఏడవ తరగతి చదువుతోంది. కాగా, హర్షిత శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత తోటి విద్యార్థులతో కలిసి ఆడుకుంటుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా స్పృహ తప్పి కింద పడిపోయింది. వెంటనే తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ప్రాథమిక చికిత్స నిర్వహించి అంబు లెన్స్‌కు సమాచారం అందించి సమీపంలోని సురభి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు హర్షితను పరీక్షించి మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని హర్షిత అక్క వర్ష, ఉపాధ్యాయులు.. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. అప్పటికే హర్షిత మృతిచెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు తండ్రి తిరుపతి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు సిఐ తెలిపారు.




### త్వరలో
## సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవం

- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**
అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత త్వరలోనే ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సదర్మాట్ బ్యారేజీని ప్రారంభోత్సవం చేస్తామని మిగితా 2వ పేజీలో



# త్వరలో సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్నారు. శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. చనాకా కొరాట ప్రాజెక్టుకు రూ.70 కోట్లు విడుదల చేశామని అన్నారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తామన్నారు. బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ చనాకా కొరాట ప్రాజెక్టును 2017లోనే పూర్తి చేస్తామంటూ కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. భూమిని కోల్పోయిన బాధితులకు 2016లో పరిహారం ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటికీ ఇవ్వలేదని చెప్పారు. 200 మంది రైతులు పాదయాత్ర చేసుకుంటూ హైదరాబాద్ చేరకున్నారని వివరించారు. అసెంబ్లీకి వస్తుంటే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారని అన్నారు. ఆ రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# అటవీశాఖలో ఏసీబీ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేసినట్టు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని ఎఫ్‌డీఓలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రుగొండ మండలం సీతాయిగూడెం సమీపంలో ఉన్న జామాయిల్ తోటలో కర్రను నరికేందుకు కాంట్రాక్టర్‌కు చెల్లించే బిల్లును శాంక్షన్ చేసేందుకు ఎఫ్‌డీఓ డివిజనల్ మేనేజర్ తాటి శ్రీ శ్రావణి, ప్లాంటేషన్ మేనేజర్ తాడి రాజేందర్ కాంట్రాక్టర్‌ను రూ.3.51లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఫారెస్టు పరిధిలోని జామాయిల్ తోటలో 32 వేల టన్నుల జామాయిల్ కర్ర నరికినందుకు గాను ఫారెస్టు శాఖ కాంట్రాక్టర్‌కు సుమారు రూ.2 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులో లంచం కింద టన్నుకు రూ.150 చొప్పున చెల్లించాలని అధికారులు డిమాండ్ చేయగా.. రూ.90 చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. దీనిపై కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ క్రమంలో శనివారం సీతాయిగూడెం వద్ద లంచం ఇచ్చేందుకు అధికారులను కాంట్రాక్టర్ సంప్రదించగా వారు హైదరాబాద్ మీటింగ్‌కు వెళ్లామని, తమకు సంబంధించిన వ్యక్తిని మధ్యవర్తిగా పంపిస్తామని తెలిపారు. మధ్యవర్తిగా సూపర్‌వైజర్ కృష్ణయ్య రాగా, అతనికి కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కృష్ణయ్యతోపాటు హైదరాబాద్ అటవీశాఖ సమావేశానికి వెళ్లిన ఎఫ్‌డీఓ డివిజనల్ మేనేజర్ తాటి శ్రీ శ్రావణి, ప్లాంటేషన్ మేనేజర్ తాడి రాజేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు డీఎస్పీ రమేష్ తెలిపారు.

# పురోగతి లేని ఆయిల్‌పామ్ కంపెనీల ఫ్యాక్టరీ జోన్ల రద్దు

- **ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధి కోసం కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లలో ఒప్పంద నిబంధనల ప్రకారం పురోగతి సాధించని కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పురోగతి లేని ఆయిల్ ఫామ్ కంపెనీలకు కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లను తగ్గిస్తూ ఆయా ప్రాంతాలను తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లాలో లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రయివేటు లిమిటెడ్)కు కేటాయించిన 44,527 ఎకరాల్లో 6721 ఎకరాల్లో మాత్రమే ఆయిల్ ఫామ్ సాగులోకి తెచ్చినందున కరీంనగర్ జిల్లాకు సబంధించిన ఫ్యాక్టరీ జోన్‌ను రద్దు చేసి తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు. మ్యాట్రిక్స్ ఫామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రయివేటు లిమిటెడ్‌కు కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాలో కేటాయించిన 30,552 ఎకరాలకుగానూ కేవలం 1606 ఎకరాలు, కేఎన్ బయోసైన్సెస్‌కు హన్మకొండలోని 9 మండలాలు, వరంగల్ జిల్లాలోని రెండు మండలాలను కలిపి రూ.14 వేల ఎకరాలు లక్ష్యం ఇవ్వగా, కేవలం 2136 ఎకరాలను మాత్రమే సాగులోకి తెచ్చారు. దీంతో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా వారికి ఆయా జిల్లాల్లో కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లను పూర్తిగా రద్దు చేస్తూ ఆయా ప్రాంతాలను ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు.

# మదురోను ఆధీనంలోకి తీసుకున్నాం

- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**బలగం టీవీ, హైదరాబాద్**



అత్యంత పటిష్టమైన పహారా గల భవనం నుంచి మదురోను తమ ఆధీనంలోకి తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. వెని జులాకు సంబంధించి తదుపరి చర్యలేమి టన్నది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శనివారం ఫాక్స్ న్యూస్‌కు టెలిఫోన్‌లో ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన ఈ వివరాలు చెప్పారు. మదురో దంపతులను న్యూ యార్క్‌కు తరలిస్తామని, అక్కడ వారిపై మాదక ద్రవ్యాలు, ఉగ్ర వాదానికి సంబం ధించిన క్రిమినల్ అభియోగాలపై విచారిస్తామని తెలిపారు. పైగా మదురోను తమ కస్టడీలోకి తీసు కుంటున్న చర్యను తాను 'టెలివిజన్ షో' లా చూశానంటూ ట్రంప్ విప రీతపు వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రత్యేక బలగాల కార్య కలాపాలను ప్రత్య క్షంగా చూశానని చెప్పారు. " మదురో వదిలిపెట్టిన బాధ్య తలను స్వీకరిం చడానికి ఎవరినీ అను మతించబోం, ఆ ప్రజల కోసం ఏదైనా చేసే స్వేచ్ఛ మాకు ఉంది. ఈ విషయాల్లో మా జోక్యం చాలా ఎక్కువగా వుంటుంది." అని చెప్పారు. పైగా అమెరికాను ఎవరూ తేలికగా తీసుకోలేరని ఈ సాహ సోపేతమైన దాడి తెలియజేసిం దంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వెని లాపై సైనిక ఆపరేషన్ సందర్భంగా మరణాలు ఏమీ సంభవించలేదని, కేవలం కొద్దిమంది గాయపడ్డారని ట్రంప్ చెప్పారు. వెనిజులా నేతను తమ స్వాధీనంలోకి తీసుకున్న నేపథ్యంలో ఆ దేశ చమురు పరిశ్రమలో అమెరికా చాలా గట్టిగా జోక్యం చేసుకోబోతోందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అతి గొప్పవైన చమురు కంపెనీలు మనకు ఉన్నాయి. ఈ వ్యవహారాల్లో మా ప్రమేయం ఉండబోతోందని చెప్పారు.

# వెనిజులాపై అమెరికా దాడులు

(మొదటి పేజీ తరువాయి)





ఎన్‌ఫోర్స్‌మెంట్ బలగాల సహకారంతో పని పూర్తి చేశామన్నారు. మదురోపై క్రిమినల్ అభియోగాల విచారణ వుంటుందని చెప్పారు. వెనిజులాలోని పలు రాష్ట్రాల్లో కూడా దాడులు జరిగినట్లు వార్తలందాయి. శనివారం తెల్లవారు జాము నుంచి చాలా వేగంగా ఈ పరిణామాలన్నీ చోటు చేసుకున్నాయి. వెనిజులా గగనతలాన్ని ఉపయోగించ వద్దంటూ దాడులకు ముందుగానే అమెరికా విమానయాన సంస్థలకు హెచ్చరి కలు జారీ చేసింది. మరోవైపు దేశంలోని పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలు, నివాస సముదాయాలే లక్ష్యంగా దాడులు జరిగాయని వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగజ్ తెలిపారు. ప్రభుత్వ టీవీతో టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఆమె, తమ అధ్యక్షుడు ఆయన భార్య జీవించి వున్నారా లేదా చెప్పాలని, ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అమెరికా ఆర్మీలో అత్యున్నత మిషన్ యూనిట్ అయిన ఎలైట్ డెల్టా ఫోర్స్ సభ్యులు మదురో దంపతులను కస్టడీలోకి తీసుకున్నట్లు మీడియా వార్తలు పేర్కొన్నాయి. కాగా అమెరికా మిలటరీ చర్యను పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయంగా తీవ్ర నిరసనలు వ్యక్త మవుతున్నాయి. తొలుత శనివారం తెల్ల వారు జామున రాజధాని నగరంలో ఏడు

చోట్ల పేలుళ్ళు సంభవించాయి. నగరం లో పలు చోట్ల దట్టమైన పొగ కమ్ముకున్న, ప్రజలు వీధుల్లో పరుగులు పెడుతున్న దృశ్యాలు కనిపించాయి. కారకస్ గగనతలంలో పలు అమెరికా చినూక్ మిలటరీ హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్న వీడియోతో సహా ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో పలు వీడియోలు బయటకు వచ్చాయి. బాంబు దాడుల కారణంగా కారకస్‌లోని మిలటరీ బేస్‌తో సహా పలు ప్రాంతాల్లో అంధకారం అలుముకుంది. తక్కువ ఎత్తులో ఎగురుతున్న విమానాల శబ్దాలు కూడా వినిపించాయని అధికారులు తెలిపారు. నెలల తరబడి తమపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నాలు సాగించిన ట్రంప్ చివరకు పౌర, సైనిక స్థావరాలపై దాడులకు తెగించారని మదురో ప్రభుత్వం విమర్శించింది. దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ప్రకటించింది. పెద్ద ఎత్తున సైనిక బలగాలను మోహరించినట్టు తెలిపింది. పదాతి, నావికా, వైమానిక బలగాలను అప్రమత్తం చేసినట్టు తెలిపింది. 'మన గడ్డపై అమెరికా బలగాలు విచక్షణారహితంగా దాడులకు బరితెగించాయి. వారి యుద్ధ విమానాల నుంచి క్షిపణులు, రాకెట్లు మన ప్రజల ఆవాసాలపై విరుచుకుపడుతున్నాయి." అని వెనిజులా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్ సోషల్ మీడియాలో వీడియో ప్రకటన చేశారు. దక్షిణ కారకస్‌లోని అతి పెద్ద మిలటరీ సముదాయంపై, మిరాండా, అరగ్వా, లా గుయిరా, రాష్ట్రాల్లో కూడా దాడులు జరిగాయని లోపెజ్ తెలిపారు. ఈ దాడులతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలను అంచనా వేస్తున్నట్టు తెలిపారు.

# బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తెలంగా ణకు అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. మొత్తం 814 టీఎంసీల కృష్ణా నీళ్లను తెలంగాణ, ఏపీకి న్యాయంగా కేటాయించాలని కోరారు. నదీజలాల విషయంలో తెలంగాణ హక్కులు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించేందుకు సభలో లఘు చర్చ ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇలాంటి కీలక అంశంపై చర్చ జరిగే సమయంలో బీఆర్ఎస్ సభకు గైర్హాజరవడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. నదీ జలాల అంశంపై ప్రజలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సైతం పాల్గొన్నారు.

# 17 మంది తెలంగాణ మావోయిస్టులు మాత్రమే మిగిలారు

- **రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి**
- **డీజీపీ ఎదుట దేవా సహా**

**20 మంది మావోయిస్టుల లొంగుబాటు**

**బలగం టీవీ, హైదరాబాద్**




మావోయిస్టులకు వెన్నెముక అయిన పీపుల్స్ లిబరేషన్ ఘెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) పని పరిసమాప్తమైందనీ, త్వరలోనే మిగిలినవారిని కూడా కట్టడి చేస్తామని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి ప్రకటించారు. మరోవైపు రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు 56 మంది కాకుండా కేవలం 17 మంది మాత్రమే మిగిలారని లొంగిపోయిన మావోయిస్టులను బట్టి తేలిందన్నారు. కగార్ ఆపరేషన్ దశలో 46 అతిపెద్ద ఆయుధాలతో 20 మంది మావోయిస్టులు తమ ఎదుట లొంగిపోవడం గొప్ప విజయమని ఆయన ప్రకటించారు. శనివారం డీజీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టులతో పాటు వారి వెంట తీసుకొచ్చిన ఆయుధాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ లొంగిపోయినవారిలో పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండెంట్ బడ్సే సూఖా ఎలియాస్ దేవా ఎలియాస్ దర్శన్‌తో పాటు రాష్ట్ర కమిటీకి చెందిన కె. రాజిరెడ్డి, ఆయన భార్య ఈశ్వరీతో పాటు 17 మంది పీఎల్‌జీఏ సభ్యులు ఉన్నారని ఆయన తెలిపారు.

ఇటీవలనే ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు అగ్రనేత హిడ్మాకు అతి సన్నిహితుడైన దేవా పీఎల్‌జీఏ బెటాలియన్ రూపకల్పన ఆయుధ సాంకేతిక పరిజ్ఞానం, కీలక ఆపరేషన్ నిర్వహణలో సిద్ధహస్తులని డీజీపీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని హిడ్మా గ్రామానికి చెందిన దేవా... 2002లో మావోయిస్టుల్లో చేరి దండకారణ్యంలో పీఎల్‌జీఏ బెటాలియన్ బాధ్యతలను నిర్వహిస్తూ వస్తున్నాడని ఆయన వివరించారు. రాజిరెడ్డి రాష్ట్రంలోని భూపాలపల్లి, ములుగు, వరంగల్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పని చేస్తున్నారనీ, ఆయన భార్య ఈశ్వరీ ఈ కమిటీ సభ్యురాలిగా ఉన్నారని తెలిపారు. మిగతా 17 మంది సైతం పీఎల్‌జీఏలో వివిధ స్థాయిలలో కొనసాగు తున్నారని అన్నారు.

దేవాపై రూ.70 లక్షల రివార్డు ఉన్నదనీ, మిగతా లొంగిపోయిన వారందరి పై కలిపి రూ. 1,81,90,000 నగదు రివార్డు ఉన్నదని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. వీరి దగ్గర నుంచి ఇప్పటి వరకు ఎక్కడా స్వాధీనం కాని రీతిలో రెండు ఎల్ఎంజీలు, 8 ఏకే 47లు, పది ఎస్ఎల్ఆర్‌లు, 11 ఇన్సాస్‌లు, ఒక అమెరికన్ బోల్ట్ ఆయుధం, మరో ఇజ్రాయిల్ ఆయుధం, హెలికాప్టర్లను కూల్చివేసే ఆయుధం కలిపి మొత్తం 46 ఆయుధాలను ఈ మావోయిస్టులు స్వాధీనపరిచారని తెలిపారు. ఈ ఆయుధాలకు సంబంధించిన మందుగుండు సామగ్రి, బుల్లెట్లను, భారీ ఎత్తున స్వాధీనపర్చుకున్నామని ఆయన వివరించారు. మావోయిస్టు పీఎల్‌జీఏలో దాదాపు 400కు పైగా సుశిక్షితులైన కమాండెంట్లు ఉండగా.. ప్రస్తుతం కేవలం 60 మంది మాత్రమే మిగిలారనీ, వీరు కూడా సమయం మించకముందే లొంగిపోతే వారి ప్రాణాలకు ముప్పు ఉండదని ఆయన చెప్పారు. మావోయిస్టులకు వెన్నెముక వంటి పీఎల్‌జీఏల కథ సమాప్తమైందని డీజీపీ తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు 56 మంది ఉన్నారని అనుకున్నామనీ, అయితే లొంగిపోయిన మావోయిస్టు నేతలు ఇచ్చిన సమాచారాన్ని బట్టి కేవలం 17 మందే మిగిలారని లెక్క తేలుతున్నదని అన్నారు. మిగతావారు ఆయా సమయాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మరణించి ఉండొచ్చని ఆ నేతలు భావిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం లొంగిపో యిన వారు కూడా అనారోగ్యం, పార్టీలో లుకలు కలు, సిద్ధాంతా విభేదాలు, పెరిగిన పోలీసు సాయుధబలగాల పట్టుతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు కారణంగా లొంగిపోతున్నట్టు తెలిపారని ఆయన వివరించారు. ప్రస్తుతం లొంగిపోయినవారు ఒక్కొక్కరికి తక్షణ పరిహారంగా రూ.25 వేల చెక్కులను అందజేస్తున్నామనీ, ప్రభుత్వపరంగా ఇతర సహాయ, సహకారాలు కూడా వారి జీవనోపాధికి అందజేస్తామని డీజీపీ తెలిపారు.

# రోడ్డు నియమాలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని జిల్లా రవాణాధికారి లక్ష్మణ్ స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఇల్లంతకుంటు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించడం ప్రాణరక్షణకు ముఖ్యమని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగో రూట్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి ప్రాణాలు తీస్తాయని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. అధిక వేగం ప్రమాదకమని, ఇంట్లో మీ కోసం ఎదురుచూసే కుటుంబాన్ని గుర్తుంచుకోవాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమించి పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఆటో డ్రైవర్లకు కూడా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంవలో ఆర్టీఏ మెంబ సంగీతం శ్రీనాథ్, సర్పంచ్ మామిడి రాజు, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, మోటార్ వాహనాల తనిఖీ అధికాఉలు వంశీధర్, రజిని, పృథ్వీరాజ్ వర్మతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు , గ్రామస్తులు పాల్గొన్నారు.



# చందుర్తిలో సావిత్రి బాయి పూలే జయంతి

**బలగం టీవీ, చందుర్తి**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో స్త్రీ విద్య కోసం, సామాజిక సమానత్వం కోసం సావిత్రి బాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్యాక్స్ చైర్మెన్ తిప్పని శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, పార్టీ సీనియర్ నాయకులు వరికిల బాబురావు, లక్కర్సు మహేష్, సిరికొండ మల్లయ్య, లక్కర్సు రాజేశం, జలగం అజయ్, మరి లక్ష్మణ్, పి. జ్యోతి, కార్యకర్తలు, అభిమానలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులు అవినీతి బయటపడుతుందని జంకుతున్నారు

- **కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవి, హైదరాబాద్**

కృష్ణా జలాలపై దమ్మూ, ధైర్యం ఉంటే అసెంబ్లీ సమావేశం పెట్టమన్న కేసీఆర్ తీరా సమావేశం పెడితే, కేవలం సంతకం పెట్టి రెండు నిమిషాలల్లో వెళ్లిపోయారని కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల తప్పులు, అవినీతి ఎక్కడ బయటపడుతాయోనని జంకుతున్నారని, కేసీఆర్ చేష్టలతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారన్నారు. మాట్లాడడానికి సమయం ఇచ్చినా కావాలనే గొడవ చేసి హరీశ్‌రావు వాకౌట్ చేశారన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పెడుతున్నారని, కాంగ్రెస్ అడిగే ప్రశ్నలకు, కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక తొకముడిచి పారిపోయారన్నారు. కుటుంబ కథా చిత్రాన్ని రక్తి కట్టిస్తున్నారన్నారు. కవిత తాము అడిగిన ప్రశ్నలకు అవినీతి జరిగింది వాస్తవం అని స్వయంగా చెబుతున్నారన్నారు. స్వయంగా కేసీఆర్ కూతురు మాట్లాడుతూ కేసీఆర్ కృష్ణా జలాలపై అసెంబ్లీకి చర్చకు రాకపోతే వారి పార్టీని దేవుడు కూడా కాపాడలేదని అంటోందన్నారు. ప్రజలకు క్షమాపణ చెప్పి కేసీఆర్ అసెంబ్లీలో చర్చకు రావాలన్నారు. అధికారంలో ఉంటేనే కేసీఆర్ సభకు వస్తారా అన్ని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడాల్సి వస్తుందనే బీఆర్ఎస్ నేతలు వాకౌట్ చేశారన్నారు. మహాత్మా గాంధీ పేరు పథకం నుండి తొలగించవచ్చు కానీ ప్రజల గుండెల్లో నుంచి తీసివేయలేరన్నారు. భవిష్యత్తులో ఇండియన్ కరెన్సీపై ఉన్న గాంధీ ఫోటో కూడా తొలగిస్తారేమో అని అనిపిస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం పేరులో గాంధీ పేరును యథాతథంగా కొనసాగించాలని, గాంధీ కుటుంబంపై విష ప్రచారం బీజేపీ నేతలు మానుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రతిపక్ష నాయకుల తప్పులు బయటపడ్తాయని వాకౌట్ చేశారు

**ప్రభుత్వ విప్, కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

ప్రతిపక్ష నాయకుల తప్పులు బయటపడ్తాయని వాకౌట్ చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అన్ని దోచుకొని తోకముడుచుకొని పారిపోయారని, మాట్లాడడానికి సమయం ఇవ్వాలని బీఏసీ సమావేశంలో అడిగారిని గుర్తు చేశారు. మూసీ పునర్జీవనం చేద్దామని మంచి నిర్ణయం తీసుకుంటే చర్చకురారన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చి, నిధులకు తూట్లు పొడుస్తుంటే కేంద్రంతో ఉన్న దోస్తానాతో బీఆర్ఎస్ చర్చలో పాల్గొనలేదన్నారు. కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందన్నారు. కేంద్రం చేస్తున్న నష్టం బీఆర్ఎస్ పార్టీకి కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. గాంధీ కుటుంబం పేరు చెబితేనే మోడీకి వణుకు పుడుతున్నదన్నారు. కమీషన్ల కక్కుర్తితో పాలమూరు రంగారెడ్డి ఎండబెట్టారన్నారు. ధైర్యం ఉంటే అసెంబ్లీలో కృష్ణా జలాలపై, పాలమూరు రంగారెడ్డిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.



# టెస్లాను దాటిన బీవైడీ

**బలగం టీవి, హైదరాబాద్**

అమెరికాకు చెందిన అపరకుబేరుడు ఎలన్‌మ స్కకు చెందిన టెస్లాను చైనా ఆటోమొబైల్ దిగ్గజం బీవైడీ అధిగమించింది. గడిచిన ఏడాది 2025 విక్రయాల్లో మొదటిసా రిగా టెస్లాను బీవైడీ వెనక్కి నెట్టింది. గ్లోబల్ టైమ్స్ రిపోర్ట్ ప్రకారం..ప్రపంచంలోనే అత్యధిక విద్యుత్ వాహనాలను విక్రయించిన సంస్థగా బీవైడీ రికార్డ్ సృష్టించింది. మరోవైపు టెస్లా అమ్మకాలు తొలిసారి తగ్గిపోయాయి. 2025లో గ్లోబల్‌గా టెస్లా 16.3 లక్షల యూనిట్లను డెలివరీ చేసింది. ఇది గత ఏడాదిలోని 17.3 లక్షల యూనిట్లతో పోలిస్తే 8.6 శాతం తగ్గుదల. వార్షిక ఉత్పత్తిలోనూ 6.7 శాతం పతనాన్ని చవి చూసింది. మరోవైపు 2025లో బీవైడీ 46 లక్షల యూనిట్లను డెలివరీ చేసింది. ఇది 2024 కంటే 7.7 శాతం అదనం. ఇందులో కేవలం పూర్తి ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు 28 శాతం పెరిగి 22.5 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. 'చైనా నూతన ఇంధన వాహనాల తయారీదారులు ఉత్పత్తి, సరఫరా గొలుసులలో మరింత పోటీతత్వాన్ని సాధిస్తున్నారు. ఈ కంపెనీలు పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ)పై నిరంతరం పెట్టుబడులు పెట్టడం, సాంకేతికతను వేగంగా అభివృద్ధి చేయడం, చైనాలోని అధునాతన తయారీ ఫ్యాక్టరీలు తదితర అంశాలు ఈ వృద్ధికి తోడ్పడుతున్నాయి." అని చైనా ప్యాసిం జర్ కార్ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ కుయ్ డాంగ్షు పేర్కొన్నారు.

# మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీ రిటైర్

**బలగం టీవి, హైదరాబాద్**



మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీగా రికార్డులోకెక్కిన రష్మీ శుక్లా శనివారం రిటైరయ్యారు. దాదాపు 37 ఏండ్లు భారత పోలీసు సర్వీసులో ఆమె సేవలందించారు. ఆమె 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. సీనియర్ అధికారుల సమక్షంలో భోయివాడలోని నైగావ్ పోలీస్ గ్రౌండ్‌లో వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రష్మీ శుక్లా గౌరవ వందనాన్ని అందుకున్నారు. కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "37 ఏండ్ల 6 నెలలు సేవ చేసిన తర్వాత ఇండియన్ పోలీస్ సర్వీస్ నుంచి నేను రిటైర్ అవుతున్నా. నాకు పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తున్నాయి. మహారాష్ట్ర పోలీస్ నాకు చాలా ఇచ్చింది. నేను చాలా నేర్చుకున్నా. నేను చాలా సంతృప్తిలో ఉన్నా" అని ఆమె చెప్పారు. తొలి మహిళా డీజీపీగా తన అనుభవం గురించి ఆమె మాట్లాడుతూ.. ఈ పోస్ట్‌కు లింగ భేదం ఉండదనీ, పని మాత్రం ఒకేవిధంగా ఉంటుందని చెప్పారు. గతంలో తాను శాస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) డీజీగా కూడా పని చేశాననీ, తనకు గర్వంగా ఉన్నదని తెలిపారు. కాగా మహారాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సదానంద్ దాతె నియమితులయ్యారు.

# వికేంద్రీకత పరిపాలన కోసం అధికారాల బదిలీ

**- ఉత్తర్వులు జారీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ కర్ణన్**

**బలగం టీవి, హైదరాబాద్**

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి 650 చ.కిమీ నుంచి 2,053 చ.కిమీకి విస్తరించిన నేపథ్యంలో, ప్రజలకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ క్రమంలో వికేంద్రీకత పాలనను బలోపేతం చేయడమే లక్ష్యంగా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కీలక అధికారాలను బదిలీ చేశారు. జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 119 ప్రకారం, ఆస్తి పన్ను అంచనాలు, సవరణలు, మ్యూటేషన్లు, మినహాయింపులు తదితర సేవలకు సంబంధించిన అధికారాలను నిర్దిష్ట పరిమితులు, షరతులతో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు అప్పగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో పరిపాలనా ఆలస్యాలు తగ్గి, ప్రజల దరఖాస్తుల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, విస్తరించిన జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు మరింత చేరువైన పాలన సాధ్యమవుతుంది. ఇది వికేంద్రీకత పరిపాలన, పారదర్శకత, సమర్థవంతమైన పట్టణ పాలన పట్ల జీహెచ్ఎంసీ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అప్పగించిన అధికారాలు సంబంధిత ఎస్ఓపీలు, జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనల ప్రకారం అమలు చేయబడతాయి. పరిపాలన ప్రయోజనార్థం ఈ అధికారాలను సమీక్షించడానికి, సవరించడానికి కమిషనర్ సమీక్షిస్తారు.

# రోబోటిక్ టెక్నాలజీతో సమస్యల గుర్తింపు

**- సమీక్ష సమావేశం నిర్వహించిన ఎండీ అశోక్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

కలుషిత నీటి సరఫరాతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జలమండలి 'వాటర్ పొల్యూషన్ ఫ్రీ' సిటీగా తీర్చి దిద్దడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కలుషిత నీరు ఫిర్యాదులను 'జీరో'కు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులతో శనివారం ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వివిధ కారణాలతో ప్రతినిత్యం కలుషిత నీరు ఫిర్యాదులు నమోదు అవుతాయని, వెంటనే అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అయితే, ఎం.సీ.సీ కి అందే కలుషిత నీరు ఫిర్యాదులు ఏయే ప్రాంతాల నుంచి అధిక ఫిర్యాదులు వచ్చాయో, తరచూ నమోదవుతున్న ఫిర్యాదుల ప్రాంతాల వివరాలను సేకరించి సమస్య మూలాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ వారీగా కాలం చెల్లిన పైపు లైన్ల వివరాలు, కలుషిత నీరు నమోదయ్యే ఫిర్యాదుల ఆధారంగా, ఒకటి కంటే ఎక్కువ సార్లు ఫిర్యాదులు అందే ప్రాంతాల్లో పైపు లైన్ల వివరాలను సేకరించాలని చెప్పారు. ఆ ప్రాంతాల్లో పైపు లైన్ల పటిష్టతను అంచనా వేసి మార్చడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వీటితోపాటు, కాలం చెల్లిన పైపు లైన్ల స్థానంలో కొత్త పైపు లైన్ల నిర్మాణం చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేయడానికి సరైన కార్యాచరణ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రానున్న రెండు నెలల్లో పైప్ లైన్ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయడానికి సిద్ధం కావాలని అధికారులను కోరారు. దానికి సంబంచిన కొత్త పైప్ లైన్ నిర్మాణ పనుల అంచనాలు వెంటనే సమర్పించి ఆమోదం పొందాలని సూచించారు. ఇప్పటికే కలుషిత నీరు కనిపెట్టేందుకు.. జలమండలి ఇప్పటికే కలుషిత నీరు, లీకేజీలు అరికట్టడానికి జలమండలి రోబోటిక్ టెక్నాలజీతో పనిచేసే పొల్యూషన్స్ ఐడెంటిఫికేషన్ మెషిన్ అనే యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఈ సందర్భంగా ఎండీ వివరించారు. దీన్ని పైప్ ఇన్ స్పెక్షన్ కెమెరా సిస్టం అని కూడా అంటారని దీని ద్వారా కలుషిత నీటి సరఫరా, లీకేజీలను త్వరగా గుర్తించి సమస్యలను పరిష్కరిస్తామని అని చెప్పారు.

# చండీగఢ్‌పై హైదరాబాద్ విజయం



**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ ఎట్టకేలకు ఓ విజయం సాధించింది. ఎలైట్ గ్రూప్–బిలో రాజ్‌కోట్‌లో చండీగఢ్‌పై 136 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 286 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (109, 118 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా.. అభిరాత్ రెడ్డి (71, 64 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో రాణించాడు. ఆమన్ రావు (13), తన్మయ్ అగర్వాల్ (16), వరుణ్ గౌడ్ (13), ప్రజ్ఞయ్ రెడ్డి (9), నితీశ్ రెడ్డి (13)లు నిరాశపరిచారు. ఛేదనలో చండీగఢ్ 37.4 ఓవర్లలో 150 పరుగులకు కుప్పకూలింది. రక్షణ్ రెడ్డి (3/34), నితీశ్ రెడ్డి (2/27), సివి మిలింద్ (2/20) వికెట్ల వేటలో విజృంభించారు. మహ్మద్ సిరాజ్ (1/19), అనికెత్ రెడ్డి (1/24) తలా ఓ వికెట్ పడగొట్టారు. చండీగఢ్ తరఫున సన్యమ్ సైని (46, 32 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), విష్ణు కశ్యప్ (27 నాటౌట్, 34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మనన్ వోహ్రా (24, 38 బంతుల్లో 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. సెంచరీ హీరో తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

# ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి విడుదల చేసిన కేకేఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**



బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై హింసాత్మక ఘటనలు కొనసాగుతున్న వేళ..బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ తీసుకోవటంపై ఇక్కడ ఆధ్యాత్మిక, రాజకీయ నాయకులు ఆ ఫ్రాంఛైజీ యజమాని షారుకపై విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీసీఐ సూచనల మేరకు కోల్‌కతా నైట్‌రైడర్స్ యాజమాన్యం ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తమ జట్టు నుంచి తప్పించింది. 'ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో బీసీసీఐ సూచనల మేరకు బంగ్లాదేశ్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను జట్టు నుంచి విడుదల చేస్తున్నాం. బోర్డును సంప్రదించి, సంబంధిత వర్గాలతో మాట్లాడిన తర్వాతే ముస్తాఫిజుర్‌ను విడుదల చేస్తున్నామని 'నైట్‌రైడర్స్ యాజమాన్యం తెలిపింది. ఇటు నైట్‌రైడర్స్, అటు బీసీసీఐ వర్గాలు అధికారికంగా కారణాలు వెల్లడించలేదు. ఈ ఏడాది భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడుతుందని ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటించిన మరుసటి రోజే భారత క్రికెట్‌లో ఈ పరిణామం చోటుచేసుకోవటం గమనార్హం. ముస్తాఫిజుర్ రెహమాన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్, రాజస్తాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించి 60 మ్యాచ్‌ల్లో 65 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది మినీ వేలంలో ముస్తాఫిజుర్‌ను రూ. 9.2 కోట్లకు కోల్‌కతా దక్కించుకుంది. ముస్తాఫిజుర్ రెహమాన్ స్థానంలో మరో ఆటగాడిని ఎంచుకునేందుకు నైట్‌రైడర్స్‌కు బీసీసీఐ అనుమతి ఇచ్చినట్టు సమాచారం. ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్‌లో ఆడనివ్వకుండా చేసిన ఘటనపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) స్పందించాల్సి ఉంది. ముస్తాఫిజుర్ రెహమాన్ ప్రస్తుతం బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో రాంగ్‌పూర్ రైడర్స్ తరఫున ఆడుతున్నాడు.

# 'టాక్సిక్..'లో రెబెకాగా తారా

**బలగం టీవీ, హైదరాబాద్**



యష్ నటిస్తున్న నూతన చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి నాడియా పాత్రలో నటిస్తున్న కియారా అద్వానీ.. మిస్టీరియస్, గ్లామరస్ ఎలిజిబెత్ పాత్ర పోషిస్తున్న హుమా ఖురేషి.. పవర్‌ఫుల్ గంగ పాత్రలో నయనతార పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదలై ఈ సినిమాలోని డార్క్ వరల్డ్‌పై ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింతగా పెంచేశాయి. తాజాగా మేకర్స్ అందమైన, ఆకర్షణీయమైన, సున్నితమైన రెబెకా పాత్రలో నటిస్తున్న తారా సుతారియా పాత్రను పరిచయం చేశారు. ఇలా సినిమాలోని పాత్రలను పరిచయం చేయటం ద్వారా.. సినిమా స్కేల్ పాన్ ఇండియా రేంజ్‌ను తెలియజేస్తోంది. ఇందులో హై యాక్షన్ సీక్వెన్స్, భారీ డ్రామా, కథలోని అనేక మలుపులుండబోతున్నాయి. తాజాగా తారా సుతారియా లుక్‌ను రివీల్ చేశారు. ఇది ఆమెకు తొలి పాన్ ఇండియా మూవీ. ఆమె కెరీర్‌లో ఇదొక కొత్త అధ్యాయం. పోస్టర్ చూస్తుంటే తనను తాను రక్షించుకోగల ధైర్యం, సామర్థ్యమున్న పాత్రలో ఆమె మెప్పించనుంది. అందమైన అమ్మాయిగా టాక్సిక్ అనే ప్రమాదకరమైన, కఠినమైన ప్రపంచంలోకి అడుగు పెడుతుంది. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్ మాట్లాడుతూ, 'నటిగా తారాకి ఇది కావాలని బలంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆమెకు కావాల్సినంత స్వేచ్ఛను ఇస్తే చాలు. అదే నేను చేశాను. ఆమె ప్రతి విషయాన్ని సునిశితంగా గమనించేది. పాత్ర గురించి ఎక్కువగా ఆలోచించేది. ఆమెను ఎలా గైడ్ చేయాలా ? అని నేను ఆలోచించిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆమె పాత్రలో అద్భుతంగా జీవించింది. ఇది నన్నెంతో ఆశ్చర్యపరిచింది. నన్నే కాదు.. అందరినీ ఇది ఆశ్చర్యపరుస్తుందనటంలో సందేహం లేదు' అని అన్నారు.

యష్, గీతూ మోహన్‌దాస్ కలిసి కథను రాసి.. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఒకేసారి చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాను హిందీ, తెలుగు, తమిళం, మలయాళం సహా మరికొన్ని భాషల్లో డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై వెంకట్ కె.నారాయణ, యష్ నిర్మిస్తున్నారు. మార్చి 19న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు.

# కివీస్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ఎంపిక

- **జట్టులోకి శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్**

**బలగం టీవీ, హైదరాబాద్**

బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ శనివారం భారత వన్డే జట్టును ఎంపిక చేసింది. శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో పాటు హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ సైతం వన్డే జట్టులోకి తిరిగి ఎంపికయ్యాడు. హార్దిక్ పాండ్యకు విశ్రాంతి లభించగా..దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో ఆడిన తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, ధ్రువ్ జురెల్‌కు కివీస్ సిరీస్‌కు జట్టులో చోటు దక్కలేదు. భారత్, న్యూజిలాండ్ వన్డే సిరీస్ జనవరి 11 నుంచి ఆరంభం కానుంది. తొలి వన్డే 11న వడోదరలో, 14న రెండో వన్డే రాజ్‌కోట్‌లో, మూడో వన్డే 18న ఇండోర్‌లో జరుగుతుంది.

దక్షిణాఫ్రికాతో ఈడెన్‌గార్డెన్స్ టెస్టులో మెడ నొప్పితో బాధపడిన శుభ్‌మన్ గిల్.. గువహటి టెస్టుతో పాటు సఫారీలతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం మెడ గాయం నుంచి కోలుకుని బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సాధించిన గిల్ వన్డే జట్టులోకి తిరిగి రావటంతో కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో కష్టసాధ్యమైన క్యాచ్ అందుకునే క్రమంలో తీవ్రంగా గాయపడిన శ్రేయస్ అయ్యర్.. ప్లీహంలో చీలిక గాయానికి గురయ్యాడు. అంతర్గత రక్త స్రావంతో ప్రాణాపాయ పరిస్థితి ఎదుర్కొన్న అయ్యర్‌కు ఆస్ట్రేలియాలోని ఓ




ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. బెంగళూర్‌లోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో రెగ్యులర్ ఫిట్‌నెస్‌తో పాటు శుక్రవారం సీఓఈ గ్రౌండ్స్‌లో మ్యాచ్ ఫిట్‌నెస్ సైతం నిరూపించుకున్నాడు. అయినా, గత సెప్టెంబర్ తర్వాత గ్రౌండ్‌లో అడుగుపెట్టని శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ మెడికల్ టీమ్ మరోసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంది. ఫిట్‌నెస్ టెస్టులో పాసైతే వన్డే జట్టులో చోటుతో పాటు వైస్ కెప్టెన్‌గా అయ్యర్ కొనసాగనున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో చివరగా వన్డే మ్యాచ్ ఆడిన మహ్మద్ సిరాజ్ ఇటీవల దేశవాళీ సర్క్యూట్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీతో పాటు విజయ్ హజారే ట్రోఫీలోనూ హైదరాబాద్ తరఫున బరిలోకి దిగి సత్తా చాటాడు. గాయాల నుంచి కోలుకుని భారత జట్టులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లు ఈ నెల 6న విజయ్ హజారే ట్రోఫీలో ఆడనున్నారు. హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో ముంబయి తరఫున శ్రేయస్ అయ్యర్.. గోవాతో మ్యాచ్‌లో పంజాబ్ తరఫున శుభ్‌మన్ గిల్ బరిలోకి దిగుతారు.

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్‌కు తుది జట్టులో అవకాశం రాలేదు. కానీ రుతురాజ్ గైక్వాడ్ రాయ్‌పూర్ వన్డేలో 105 పరుగుల శతక ఇన్నింగ్స్‌తో మెరిశాడు. అయినా, రుతురాజ్ తాజాగా కివీస్‌తో సిరీస్‌కు జట్టులో చోటు నిలుపుకోలేకపోయాడు. ఇక భారత జట్టులో శుభ్‌మన్, అయ్యర్‌తో పాటు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ స్పెషలిస్ట్ బ్యాటర్లు. సఫారీతో సిరీస్‌లో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన కెఎల్ రాహుల్, రిషబ్ పంత్‌లు వికెట్ కీపర్ బ్యాటర్లుగా జట్టులో కొనసాగుతున్నారు. వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి ఆల్‌రౌండర్లు కాగా.. కుల్‌దీప్ యాదవ్ స్పెషలిస్ట్ స్పిన్నర్. హర్షిత్ రానా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ పేస్ విభాగంలో ఉన్నారు. హార్దిక్ పాండ్య ఫిట్‌నెస్‌తో ఉన్నప్పటికీ.. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ కోసం అతడికి సెలక్షన్ కమిటీ విశ్రాంతి ఇచ్చింది. గతంలో సీఓఈ వైద్య బృందం సైతం హార్దిక్ పాండ్య ఓ మ్యాచ్‌లో 10 ఓవర్లు వేసేందుకు అనుమతి ఇవ్వలేదు.

# రజనీకాంత్, కమల్ హాసన్ కాంబోకు దర్శకుడు ఫిక్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ తమ బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రానికి దర్శకుడిని అనౌన్స్ చేసింది. రజనీకాంత్, కమల్ హాసన్ కాంబి నేషన్‌లో తెరకెక్కబోయే ఈ చిత్రానికి సిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తారు. ఇది రజనీకాంత్ నటిస్తున్న 173వ చిత్రం. ఇది నెక్ట్స్ లెవల్ సినిమాటిక్ గ్రాండి యర్‌గా ఉండనుంది అని మేకర్స్ తెలిపారు. రజనీకాంత్ హీరోగా కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మాణంలో రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ లెగసీని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోనుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రం మాస్ అప్పీల్, ఎమోషన్, హై క్యాలిటీ మేకింగ్‌తో ప్రేక్షకులని అలరించబోతోంది.సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభమవుతుంది. త్వరలోనే తారాగణం, టెక్నికల్ టీం గురించి మరిన్ని వివరాలను రివీల్ చేయనున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు స్పెషల్ ట్రీట్‌గా 2027




పొంగల్ సందర్భంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. సూపర్ స్టార్ పవర్, ఎంటర్టైన్మెంట్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రం పర్‌ఫెక్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించనుంది అని చిత్రయూనిట్ తెలిపింది.

# 30న 'గాంధీ టాక్స్' విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

జీ స్టూడియోస్ నిర్మిస్తున్న నూతన చిత్రం 'గాంధీ టాక్స్'కు సంబంధించి విడుదల తేదీని అధికారికంగా అనౌన్స్ చేసింది. ఈ మూవీ ఈనెల 30న గ్రాండ్ రిలీజ్ అవుతుంది. ఇండియన్ సినిమాల్లో అరుదైన సైలెంట్ ఫిల్మ్‌గా 'గాంధీ టాక్స్' రూపొందింది. కథను వివరించటానికి మాటల కంటే నిశ్శబ్దం బలమైన అంశంగా నిలుస్తోంది. ఇది సినీ ప్రపంచంలో ధైర్యమైన, సృజనాత్మకమైన అడుగు అని మేకర్స్ తెలిపారు. సినిమాను ఎంత గ్రాండియర్‌గా, ఎలాంటి సౌండ్‌తో రూపొందించారంటూ లెక్కలు వేసే నేటి రోజుల్లో ఈ సినిమా తన సందేశాన్ని శాంతియుతంగా, ఎలాంటి శబ్దాలు లేకుండా, భావోద్వేగాలతో చెప్పబోతుంది. ఇందులో విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితి రావ్ హైదరి, సిద్ధార్థ్ జాధవ్ వంటి నటీనటులు నటించారు. వీరందరూ తమ హావభావాలతో, నటనతో స్టోరీని అందరికీ తెలియజేస్తున్నారు. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి వంటి స్టార్స్ ఈ సైలెంట్ ఫిల్మ్‌లో నటించటానికి ఒప్పుకున్నారంటే సినిమా అనేది నటన ఆధారిత సినిమా అని కూడా నిరూపించే ప్రయత్నం చేయటమే. ఇది నిజంగా అతి పెద్ద ఛాలెంజ్. రొటీన్‌కు భిన్నమైన, ఛాలెంజింగ్ పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న వీరి తీరు వారి సినిమా అంటే వారికున్న ప్యాషన్‌ను తెలియజేస్తోంది. అదితి రావు హైదరి, సిద్దార్థ్ జాదవ్ వంటి స్టార్స్ పాత్రల భావాన్ని, సన్నివేశాల డెప్త్‌ను మాటలు లేకుండా




హావభావాలతో కథను నెరేట్ చేయటంలో ప్రత్యేకతను చూపిస్తుంటారు. సినిమాకు ఎ.ఆర్.రెహమాన్ సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆయన ఈ చిత్రానికి ఎమోషనల్ వాయిస్‌గా నిలుస్తున్నారు. మాటలు లేకుండా రూపొందుతోన్న ఈ సినిమాకు రెహమాన్ సంగీతం నెరేటర్‌గా మారుతూ సినిమాలోని డెప్త్‌ను ప్రేక్షకులకు తెలియజేయనుంది.

ఈ సందర్భంగా దర్శకుడు కిషోర్ బెలేకర్ మాట్లాడుతూ, 'నిశ్శబ్దం అనేది శక్తివంతం అని నమ్మి ఈ సినిమాను రూపొందించాం. శతాబ్దంగా ఇండియన్ సినీ మేకర్స్ పలు రకాలైన కథలతో సినిమాలు చేస్తున్నారు. ఇలాంటి కళలో నటన, ఎమోషన్స్‌ను బేస్ చేసుకుని సినిమా చేయాలనుకున్నాం. నటీనటులు దీనికి ఈ కొత్త ప్రయత్నంలో భాగం కావటానికి ముందుకు రావటంతో పాటు సున్నితమైన భావాలను చక్కగా పలికించారు. అదే సమయంలో ఎ.ఆర్.రెహమాన్ సంగీతం.. సినిమా కథను చెప్పే వాయిస్‌గా మారింది. జీస్టూడియోస్, మీరా చోప్రా సహకారంతో ధైర్యంగా, నిజాయతీగా కొత్త ప్రయత్నాన్ని చేశాం' అని అన్నారు.

సినిమా సాంప్రదాయాలను సవాల్ చేసేలా, కొత్తదనంతో ప్రతిష్టాత్మకంగా కథను చెప్పేలా ఉండే సినిమాలకు మద్దతు ఇచ్చే నిబద్ధతను జీ స్టూడియోస్ మరోసారి ఈ ప్రయత్నంతో తెలియజేసింది.